ప్రజాశక్తి

సోమవారం 19 ఫిబ్రవరి 2024

5

విజయనగరం



కార్మికుల పేర్లు నమోదు చేసుకోవాలి

కమిషనర్ ఎం.ఎం.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నేషనల్ యాక్షన్ ఫర్ మెకానైజెడ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే కార్యక్రమం)లో ప్రతి కార్మికుడు తమ పేరు నమోదు చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మురుగు, సెప్టిక్ ట్యాంకు కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ, పట్టణ గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నగరంలోని మురుగు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికులు గుర్తింపు ప్రక్రియ సోమవారం నుంచి కార్పొరేషన్ కార్యాలయం చేపడుతున్నట్లు వెల్లడించారు. నగర పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎండ మండిపోతోంది... గొంతెండి పోతోంది.. పని ప్రదేశాల్లో టెంట్లు, చలివేంద్రాలు లేవు. దెబ్బతగిలితే కట్టు కట్టుకునే మెడికల్ కిట్లు కూడా కానరావు. గిట్టుబాటు కాని కూలి కోసం పనులు చేస్తున్న కూలీలు సొమ్మసిల్లిపోతున్న పరిస్థితి.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు పరిశీలిస్తే... ఇట్టే కూలీలు పాట్లు అర్థమైపోతాయి.



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఎండ మండిపోతోంది..

- మండుటెండలో ఉపాధి కూలీలు
- వేసవి అలవెన్సులతో పాటు తాగునీటి సదుపాయానికి కోత
- ఆందోళనలో కూలీలు

గొంతెండి పోతోంది

ప్రజాశక్తి - జామి

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నిర్మూలనతో పాటు పేదవాడికి పని భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధి హామీ పనులకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. కానీ నేడు గ్రామీణ ఉపాధి హామీ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపహాస్యం చేస్తున్నాయి. ఇప్పటికే ఉపాధి నిధులకు ఏటా కోత విధిస్తున్న ప్రభుత్వం.. వేసవి ఎండలో పని చేసే కూలీలకు అందాల్సిన రాయితీలను కూడా కోత విధించింది. చివరికి పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యాలను కూడా లేకుండా చేసింది. ఫిబ్రవరిలోనే ఎండలో మండిపోతున్న నేపథ్యంలో ఉపాధి పనులకు వెళ్లడానికి కూలీలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి...

జామి మండలంలో 25 పంచాయతీలకు గానూ 12,125 జాబ్ కార్డుల ద్వారా సుమారు 24 వేల మంది వరకు కూలీలు ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. గతేడాది సరాసరి వేతనంగా ప్రభుత్వం రూ.257కు రూ.231 వేతనం కూలీలకు నమోదు చేసింది. కానీ ఈ ఏడాది వేసవి ఎండలకు కూలీలు పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కానీ ప్రభుత్వం రెండు పూటలా పనులు చేయాలంటూ, రోజు కూలి రూ.270 రావాలని చెబుతుంది. కానీ అందుకు తగ్గ సౌకర్యాలు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే కూలీలు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

కానరాని టెంట్లు

ఉపాధి పనులు చేయాలనే గ్రామాల్లో సుదూర ప్రాంతాల్లో ఉన్న చెరువులకు చేరుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన వేతనం నమోదు కావాలంటే కూలీలు రెండు పూటలు పనులు చేయాలని అధికారులు చెబుతున్నారు. ఉదయం 8 గంటలకు బయలుదేరి పని ప్రదేశాలను వెళ్లడానికి కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి. తీరా ఎండలో అంత దూరం నడిచాక, అక్కడ నిలువ నీడ లేకపోవడంతో మండుటెండలకు కూలీలు వడ దెబ్బబారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. కనీసం తాగడానికి నీరు అందుబాటులో లేని దుస్థితి. ఈ నేపథ్యంలోనే కూలీలు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీసం మెడికల్ కిట్లు కూడా పని ప్రదేశాల్లో కనిపించడం లేదని కూలీలు వాపోతున్నారు.

వేసవి రాయితీల్లో కోత

గత ప్రభుత్వంలో వేసవి రాయితీ కింద కూలీలకు అదనపు అలవెన్స్ అందజేసేవారు. ఎండాకాలంలో కూలీలు పనులు చేయలేరు కాబట్టి.. కొంత అదనపు ఆలవెన్స్ కింద అందించేవారు. వేసవి మూడు నెలల్లో 20 నుంచి 30 శాతం అదనపు పని కలిపేవారు. కానీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వేసవి అలవెన్సులు కోత విధించింది. తాగు నీటి సదుపాయం, గునపాలు, పారలు ఇలా, కూలీలకు అవసరమైన సదుపాయాలు లేకుండా చేసింది. ఈ నేపథ్యంలోనే ఉపాధి పనులు నరకయాతనగా ఉన్నాయని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి అలవెన్సులు అమలు చేయాలి



ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా పనిప్రాంతాల్లో టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటుచేయాలి. ప్రభుత్వం గతం మాదిరిగా వేసవి అలవెన్సులు అమలు చేయాలి. కూలీలను రెండు పూటలు కాకుండా ఒకే పూట పనులు చేసి, ప్రి మెజర్మెంట్ ద్వారా కూలి రూ.600 ఇవ్వాలి. ఉపాధి నిధులు దారిమళ్లించకుండా కూలీల మట్టి పనులకే అత్యధిక నిధులు ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

-జి.శ్రీనివాస్,
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ

బకాయిలు చెల్లించాలని కోరుతూ

20న భారీ ప్రదర్శన

ఉద్యోగులు తరలిరావాలని జెఎసి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


ఐఆర్, డిఎ, జిపిఎఫ్ బకాయిలు చెల్లించాలని ఈ నెల 20న భారీ ప్రదర్శన చేపడుతున్నట్లు ఎపి జెఎసి జిల్లా కమిటీ వెల్లడించింది. జెడ్‌పి సమావేశ మందిరం నుంచి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో జిల్లాలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ భవనంలో ఎపిజెఎసి సమావేశం నిర్వహించారు. డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. సమావేశంలో ఎపి జెఎసి జిల్లా చైర్మన్ జివిఆర్ఎస్ కిశోర్, కార్యదర్శి సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, జెఎసి నాయకులు ప్రభూజి, మురళి, ఆనంద్‌కుమార్, కెబి శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, పెద్దింటి అప్పారావు, నారాయణ, శ్రీవిద్య, ఆదిలక్ష్మి, రాజు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రమేష్‌చంద్ర పట్నాయక్, డి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

ఇష్టారాజ్యంగా క్రికెట్, బ్యాడ్మింటన్ కోచింగ్ కేంద్రాలు ● పట్టని అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాదేది డబ్బులు సంపాదించడానికి అనర్హం అన్న రీతిలో నగరంలో బ్యాడ్మింటన్, క్రికెట్ కోచింగ్ నెట్ కేంద్రాలు ఏర్పాటు అవుతున్నాయి. రోజురోజుకూ ఆరోగ్యంపై ప్రజల్లో శ్రద్ధ పెరిగింది. మరోవైపు ప్రయివేట్ పాఠశాలల్లో శారీరక వ్యాయామాలు లేవు. దీంతో ఫిజికల్ ఫిట్నెస్ కోసం వ్యాయామశాలల్లో, క్రికెట్ కోచింగ్ సెంటర్లలో, గేమ్స్ నేరో కేంద్రాల్లో చేరుతున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్‌కు ఆదరణ ఉండటంతో ఎక్కువమంది తల్లిదండ్రులు పిల్లలను కోచింగ్ కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. బ్యాడ్మింటన్‌లో అసోసియేషన్ తరపున నిర్వహిస్తున్న కోచింగ్ శిబిరాల్లో కొద్దిమందికి అవకాశం ఉంటోంది. ఆట స్థలాలు, ఇండోర్ స్టేడియాలు లేకపోవడంతో నెట్ కోచింగ్ సెంటర్లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. క్రీడల సాధనకు పెద్ద మైదానాలు, ఇండోర్ స్టేడియాలు ఉండాలి. అటువంటిది ఏమీ లేకుండా కేవలం 300 నుంచి 500 గజాల స్థలం ఉంటే చాలు. ఆ స్థలంలో చుట్టూ నెట్ కట్టి కేవలం పిచ్‌కు సరిపడే స్థలంలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. సొంత స్థలంలో కొంతమంది ఏర్పాటు చేస్తే మరి కొందరు స్థలాలు లీజుకు తీసుకుని నెట్ కట్టి కోచింగ్ సెంటర్లుగా మారుస్తున్నారు. ఇంకొంతమంది ఇంటి పై భాగంలో నెట్ కట్టి అందులో కోచింగ్ నిర్వహిస్తున్నారు. నగరంలో సుమారు 25 వరకు ఇటువంటి కేంద్రాలు వెలిశాయి.



నెట్ కోచింగ్ సెంటర్

అత్యధిక ఫీజులు వసూలు...

శారీరక వ్యాయామాల కోసం పిల్లల్ని చేర్పిస్తున్న తల్లిదండ్రులు ఎంత డబ్బులు చెల్లించేందుకైనా వెనుకాడటం లేదు. ఇదే అదునుగా కోచింగ్ సెంటర్లు క్రికెట్‌కు ఒక్కొక్కరి నుంచి రూ.500 నుంచి 1000, బ్యాడ్మింటన్‌కు రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు. వీటితోపాటు క్రీడా సామగ్రి తెప్పించి కోచింగ్ నిర్వాహకులు అమ్మడం ద్వారా కూడా భారీ ఆదాయం సంపాదిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

నగర పాలక సంస్థ అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదు. ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసినా వేకెంట్ టాక్స్ కట్టాల్సి ఉంది. అదే విధంగా కోచింగ్ ప్రచారం కోసం పెట్టే బోర్డులను కూడా అడ్వర్టైజ్‌మెంట్ పన్ను కట్టాల్సి ఉంది. వీటితోపాటు ముందుగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది . ఇవేవీ చెల్లించకుండా నగర పాలక సంస్థకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. విచ్చలవిడిగా ఇటువంటి శిక్షణ కేంద్రాలు నగరంలో పుట్టుకొస్తుంటే కనీసం వాటి గురించి నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నగర పాలక సంస్థకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఇదే నిర్లక్ష్య వైఖరి కొనసాగితే నగరంలో మరిన్ని కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రజోపకార రచనలతో ప్రయోజనం

డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజలకు ఏదోక రకంగా ఉపకారం చేయాలనే ఆలోచనతో రచనలు చేయడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆంధ్ర యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ చెనుమల్లు విశ్వేశ్వరరావు.. విదేశాల్లో ఉంటూ పలు సమస్యలు ఎదుర్కొంటున్న తెలుగువారి కోసం ఎం ఓవర్ వ్యూ ఆఫ్ దయాస్పర రైటింగ్ అనే పుస్తకాన్ని రచించారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో కోలగట్ల ఈ పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు రకాలుగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయవచ్చని తెలిపారు. తనకు తెలిసిన విషయాలను విదేశాల్లో ఉన్న భారతీయులకు ఉపయోగపడేలా పుస్తకాన్ని రూపొందించి విశ్వేశ్వరరావు సేవ చేయడం అభినందనీయమన్నారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న భారతీయులు ఉద్యోగ, జీవన విధానం పరంగా ఇతరత్రా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి సూచనలు చేస్తూ ఈ పుస్తకం రూపొందించామన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణు వందనా దేవి, దీక్షితులు, రాజు, రమణ, టివి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోలగట్ల మాటలు హాస్యాస్పదం

ప్రజాశక్తి- విజయనగరం కోట

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాటలు వింటుంటే హాస్యాస్పదంగా ఉందని టిడిపి, జనసేన నాయకులు వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ యువత గంజాయితో పక్కదోవ పడుతున్నారని కోలగట్లకు తెలియదా? అని ప్రశ్నించారు. గుంకలాం, కొండకరకం లేఅవుట్లో కుంభకోణం జరగలేదని శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అశోక్ గజపతిరాజు కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ద్వారపూడి గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ పెట్టి, నగరానికి కరెంటు భారం తగ్గించి మేలు చేశారని గుర్తుచేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దాన్ని నాశనం చేసి, కార్పొరేషన్‌కు కరెంట్ బిల్లు షాక్ ఇస్తున్నది ఎవరని ప్రశ్నించారు. నగరంలో ఏ అభివృద్ధి, సంక్షేమంపై అయినా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని మాట్లాడుతూ గోకపేట జ్యూట్‌మిల్లు ప్రభుత్వ భూములు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. రూ.200 కోళాయిలు ఇంకా పూర్తి చేయలేకపోయారని, కార్పొరేషన్ నిధులు ఎక్కడికి వెళ్తున్నాయో అందరికీ తెలుసనని వ్యాఖ్యానించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, జనసేన మండల అధ్యక్షులు బి.రామచంద్రరావు, యోగేష్, టిడిపి కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, బిసి సెల్ రాష్ట్ర నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కంది మురళి, ముద్దాడ చంద్రశేఖర్, శ్రీనివాసరావు, అనిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

బొడ్డమానుగూడలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని బొడ్డ మానుగూడలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. దీంతో ఈ గ్రామ గిరిజనుల భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు గ్రామాల్లోకి చొరబడి దాడిచేస్తాయోనని గిరిజనులు కంటిమీద కొనుక్కు లేకుండా బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఏనుగుల బారి నుంచి రక్షించాలని ఇప్పటికే గిరిజనులు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నారు ఏనుగుల సంచారంతో కొండపోడుకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన చెందుతున్నారు అంతేకాక సమీపంలో వేసిన పంటలు, కొండచిపుర్లు, అరటి, కంది తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు

20న మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ప్రచారం చేస్తున్న నాయకులు, కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఈ నెల 20న కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జగన్మోహనరావు కోరారు. ఆదివారం నగరంలోని మస్తర్ పాయింట్లలో, గాజులరేగ, హుకుంపేట, కొత్తపేట, పూల్‌బాగ్, జొన్న గుడ్డిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమ్మె సందర్భంగా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఇచ్చిన హామీల్లో భాగంగా సమ్మె కాలపు జీతం, సంక్రాంతి కానుకకు జిఒలు ఇచ్చి కూడా కార్మికులకు డబ్బులు చెల్లించలేదని చెప్పారు. క్లీన్ ఎన్విరాన్‌మెంటల్ వర్కర్లకు రూ.21 వేలు, డ్రైవర్లకు రూ.24,500 జీతం జిఒలు రావాల్సి ఉందన్నారు. స్థానికంగా రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. నీటి సరఫరా విభాగంలో పంప్ హౌస్, లీకుల్లో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలల నుంచి ఆరు నెలలు జీతాలు బకాయిలు ఉన్నాయని, జీతం ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఆప్కోస్‌లో లేని కార్మికులకు థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి, నగరపాలక సంస్థ ద్వారానే నేరుగా జీతాలు ప్రతినెలా ఏడో తేదీలోపు చెల్లించాలని డిమాండ్‌చేశారు. విలీన ప్రాంత కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామారావు, ఆదినారాయణ, రమణ, కృష్ణ, బాబూరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి



టిడిపిలో చేరిన వారికి కండువా కప్పుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగు యువత ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితిగజపతిరాజు దిశానిర్దేశం చేశారు. స్థానిక అశోక్ బంగ్లాలో ఆదివారం తెలుగు యువత సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ అనే కార్యక్రమం ద్వారా నూతనంగా ఓటు హక్కు పొందిన ప్రతిఒక్కరినీ కలిసి వారికి ఓటు ఆవశ్యకతను, రాష్ట్రంలో ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలన్నా, వారికి మంచి భవిష్యత్తు ఉండాలన్నా చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఎంత ముఖ్యమో తెలియజేసేలా వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు


నగరంలోని 27వ డివిజన్‌కు చెందిన కె.కనకరాజుతోపాటు 15 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వారికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని చెప్పారు. అందుకే వైసిపికి దూరమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి సెల్ రాష్ట్ర నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు పాల్గొన్నారు.

'సిసి' నీడలో ఇంటర్ పరీక్షలు

- 73 కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షలకు సర్వం సిద్ధం
- 'ప్రజాశక్తి'తో ఆర్ఐఒ ఆదినారాయణ ముఖాముఖి

'మార్చి ఒకటో తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసుకునేలా పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశాం. ఈ ఏడాది సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తున్నామ'ని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.ఆదినారాయణ తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణపై పలు విషయాలను ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం టౌన్



ఈ ఏడాది ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.?

ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 20,630 మంది హాజరు కానున్నారు. వారిలో బాలురు 9891 మంది, బాలికలు 10,739 మంది ఉన్నారు. మొత్తం విద్యార్థుల్లో జనరల్ –17,031 మంది, ఒకేషనల్ – 3599 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 25,134 మంది హాజరు కానున్నారు. వీరిలో బాలురు 11,872 మంది, బాలికలు 13,262 మంది ఉన్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 20,896, ఒకేషనల్ విద్యార్థులు 4238 మంది ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి.?

ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 23 తేదీ వరకు జరగనున్నాయి . ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 8.30 గంటలకు చేరుకోవాలి.

ఇంటర్ పరీక్షలు ఎన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు? సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారా.?

ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 73 కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 17, సోషల్ వెల్ఫేర్ గురుకులాలు 4, ఎపిఆర్‌జెసి 1, మోడల్ పాఠశాలలు 4, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు 48 కేంద్రాల్లో పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఎటువంటి సమస్యాత్మక కేంద్రాలూ లేవు. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం.



ఎన్ని స్టోరేజ్ పాయింట్ల నుంచి ప్రశ్నపత్రాలు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.?

జిల్లాలో 73 పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు సకాలంలో అందించేందుకు 24 స్టోరేజ్ పాయింట్లు, పోలీస్ స్టేషన్లలో ఉంచాం. వాటిని తరలించేందుకు ప్రత్యేక వాహనాలు సిద్ధం చేశాం.

పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి సౌకర్యాలు కల్పించనున్నారు.?

73 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా వెలుతురు, గాలి, ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. అన్ని కేంద్రాల్లో మెడికల్ సిబ్బందితోపాటు తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ ఉంటాయి. ఇప్పటికే మూడు దఫాలుగా వెళ్లి పరిశీలించి అందుకు తగిన ఆదేశాలు జారీ చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. కేంద్రాలకు దగ్గరలో షాపులు, జిరాక్స్ సెంటర్లు లేకుండా ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం.

విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం తీసుకున్న చర్యలేమిటి.?

పరీక్షలు రాసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి. అందుకోసం ఎపిఎస్ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి అన్ని రూట్లలో బస్సులు ఉదయం 6 గంటల నుంచి అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. మళ్లీ పరీక్ష ముగిసిన తర్వాత ఇళ్లకు వెళ్లేందుకు కూడా బస్సులు అందుబాటులో ఉంటాయి.

పరీక్షలకు ఎంత మంది సిబ్బందిని నియమించారు.?

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 1200 మందికి పైగా సిబ్బందిని, ఇన్విజిలేటర్లను నియమించాం. పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు, చీఫ్ సూపరింటెండెంట్లు ఉంటారు. కలెక్టర్ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షించనుంది. పరీక్షల నిర్వహణలో ఎటువంటి సమస్యలూ లేకుండా ప్రశాంతంగా జరిగేలా వివిధ శాఖల సహకారం తీసుకుంటాం. ఆర్‌టిసి, పోలీస్, రెవెన్యూ, మెడికల్, విద్యుత్తు శాఖల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాం.

విజ్ఞాన విహార యాత్రలో మారిక విద్యార్థులు

ప్రజాశక్తి- వేపాడ



విజ్ఞాన యాత్రకు వెళుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గిరిశిఖర గ్రామమైన మారిక పాఠశాల విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు రమేష్‌లు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా వివిధ ప్రదేశాల పర్యటన చేయించారు. ఎల్లప్పుడూ గిరిశిఖరంపై ఉండే ఈ విద్యార్థుల మానసిక వికాసంలో భాగంగా వారిని భీమిలి సముద్ర తీరానికి, విశాఖ ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలను, బీచ్‌లోని కురుసుర జాలాంతర్గామిని సందర్శింపచేశారు. వాటిని చూసి విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మనోవికాసానికి, ఈరకమైన యాత్రలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు చెప్పారు. ఈ సందర్భనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



అవార్డు, నగదు అందుకుంటున్న తేజశ్విని

ఇఇఎంటిలో తేజశ్వినికి జిల్లా మొదటి ర్యాంకు

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో గొడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని పతివాడ తేజశ్విని జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ మేరకు నిర్వాహకులు విజయవాడలో జరిగిన సభలో తేజశ్వినికి రూ.5 వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల సముదాయ చైర్మన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తేజశ్వినిని అభినందించారు.



కోట గురించి వివరిస్తున్న బేబినాయన

కోటను సందర్శించిన వెంకయ్య సతీమణి

పజాశక్తి- బొబ్బిలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష బొబ్బిలి కోటను ఆదివారం సందర్శించారు. కోటను, యుద్ధంలో వాడిన ఆయుధాలను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన దగ్గరుండి చూపించి కోట, ఆయుధాలు, యుద్ధ చరిత్రను వివరించారు. కోటను, యుద్ధంలో వాడిన ఆయుధాలను చూడడం ఎంతో ఆనందంగా ఉందని ఉష అన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి


ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల ప్రచారం చేస్తున్న సెవెంత్ డే పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేయడం అన్యాయమన్నారు. తక్షణమే విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నేటితో ముగియనున్న గడువు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట, గుడివాడ గ్రామాలలో ఖాళీలుగా ఏర్పడిన వాలంటీర్ల నియామకానికి సోమవారం మధ్యాహ్నం ఐదు గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఇన్చార్జి ఎంపిడిఒ ఉమా తెలిపారు. జగ్గయ్యపేటలో బీసీ, గుడివాడలో ఎస్సీ కులాలకు చెందిన వారికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. పదో తరగతి పాస్ అయి ఉండి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు అభినందనలు తెలిపి సన్మానించారు. ఇటీవలి పోలిపల్లి గ్రామంలో పైడితల్లమ్మ ఆలయం పున ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.10 లక్షలు సొంత సొమ్ము మ్యాచింగ్ గ్రాంట్ కింద చెల్లించడంతో ప్రభుత్వం సిజిఎఫ్ నిధుల కింద మొత్తం రూ. 50 లక్షలు చెల్లించిందని సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ పతివాడ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు తన స్వగృహంలో ఎమ్మెల్యేను ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రోతు పైడిరాజు, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- దత్తిరాజేరు

జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కళాజాత బృందం దత్తిరాజేరులో ఆదివారం వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించింది. ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపిస్తుందో నాటకం ద్వారా వివరించారు. ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజంలో కలిసి జీవించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చైతన్య భారతి, ఎం. కాశీవిశ్వనాథం, ఎస్. గోవిందరావు, సర్పంచ్ పి. చంద్రమ్మ పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురంలో రూ. 10లక్షలతో 134 మీటర్ల పొడవు కాలువ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు పర్యవేక్షణలో పనులను వేగంతం చేస్తామని మండల ఇంజనీరింగ్ అధికారి ఆలీ తెలిపారు. ఈ పనులు పూర్తయితే పాత పంచాయతీ భవనం నుండి కొత్తగా నిర్మిస్తున్న రామాలయం వరకు మురుగునీరు నిల్వ ఉండకుండా పోయే అవకాశం ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళిత కాలనీ దయనీయం

- అభివృద్ధికి దూరంగా చిన్నశిర్లాం ఎస్‌సి కాలనీ
- సిసి రోడ్లు, మురుగు కాలువలూ లేకపోయే
- ప్రధాన రహదారంతా బురదమయం
- పట్టించుకోని పాలకవర్గం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం దళిత కాలనీలో అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కాలనీలో కనీసం సీసీ రోడ్డు లేదు, కాలువలు లేవు, తాగునీటి పైపులైన్ వద్ద కూడా మురుగు నీరు విలయతాండవం చేయడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా తమ సమస్యలు పట్టించుకునే నాధుడే కరువయ్యారని దళిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో



దళిత కాలనీలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

85 కుటుంబాలు జీవిస్తున్నాయి. టిడిపి హయాంలో నిర్మించిన ఒకటి, రెండు వీధులలో సిసి రోడ్లు తప్ప మిగతా వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణాలకు నూతన పాలకవర్గం చర్యలు తీసుకోలేదు. నిర్మాణాలు చేపట్టిన సిసి రోడ్లకు డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణాలు చేపట్టకపోవడం వాడుక నీరు రోడ్ల పైన నిల్వ ఉండి నాచుతేరి దోమలకు నిలయాలుగా మారాయి. రోడ్డుపై మురుగునీరు నిల్వలతోపాటు తాగునీటి కుళాయిల వద్ద మురుగునీరు నిల్వలు ఉండడంతో వ్యాధులు సంభవిస్తున్నాయని దళితవాసులు చెబుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు, పంచాయతీ పాలకవర్గం పట్టించుకునే దాఖలాలు కనిపించలేదు. దోమలు కారణంగా విష జ్వరాలు, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి సంభవిస్తున్నాయని దళితు కుటుంబాలు చెబుతున్నాయి. తమ కాలనీపై పంచాయతీ పాలకవర్గం వివక్షత చూపుతోందని దళిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం



కుళాయికి ఆనుకుని ఉన్న మురుగు



సిసి రోడ్డుకు నోచుకోని దళిత కాలనీ

చేస్తున్నారు. గత నాలుగేళ్ల నుంచి ఈ దళిత కాలనీకి అభివృద్ధికి ఆమడ దూరంగా ఉందని చెబుతున్నారు. అసలు పంచాయతీ పాలకవర్గం గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దళిత కాలనీల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేసినప్పటికీ స్థానిక పాలకవర్గం అభివృద్ధిలో ఆమడ దూరంగా ఉందని దళిత కుటుంబాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా దళిత కాలనీ అభివృద్ధికి అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆశాజనకంగా మామిడి పూత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఈ ఏడాది మామిడి తోటల్లో పూత ఆశాజానకంగా కనిపిస్తోంది. ముందస్తుగా పెద్దఎత్తున పూతపూయడంతో ఈ ఏడాది పంట బాగా వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అయితే తెల్లవారు జామున దట్టంగా కురుస్తున్న మంచుతో పూత మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఇలాగే దిగుబడి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డామని చెబుతున్నారు.



విరగబూసిన పూత

అంబరాన్నంటిన జాకేరు జాతర



పందెంలో పాల్గొన్న ఎడ్ల బండి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరులో చిన్నమ్మలు జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందేలు, సంగిడి రాళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన ఎడ్ల పరుగు ప్రదర్శన యజమానులకు దాతలు సమకూర్చిన విరాళాలతో మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతిగా రూ.12వేలు, మూడో బహుమతిగా రూ.8వేలు అందించారు. సంగిడి రాళ్ల తీత పోటీల్లో విజేతలకూ బహుమతులు ప్రదానం చేశారు. ఎడ్ల పరుగు పోటీలు ఉత్కంఠంగా సాగాయి. నువ్వానేనా అన్న చందంగా ఎడ్ల పరుగు పలువురిని ఆకట్టుకు న్నాయి. సంగడి రాళ్ల తీతలో క్రీడాకారులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ ప్రదర్శన ఉర్రూతలూగించింది. ఆదివారం చివరి ఘట్టంతో జాతర ఘనంగా ముగిసినట్లు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, ససలాది వెంకటరావు, ఎంపిటిసి టి.వి.రమణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు వెల్లడించారు.



సంగిడిరాయి ఎత్తుతున్న క్రీడాకారుడు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

స్థానిక అభ్యుదయ పాఠశాలలో ఆదివారం అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించేందుకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 105మంది రోగులకు వైద్య పరీక్షలు చేయగా 40మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వీరందరికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని అభ్యుదయ కరస్పాండెంట్ మర్రాపు నాని, ప్రిన్సిపాల్ చింతా శారద చెప్పారు. కంటి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వైసిపి నేతకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పికెఆర్‌పురం గ్రామానికి చెందిన వైసిపి కన్వీనర్ ఎం.వెంకటరావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన విషమాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షులు ఎం జగబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు ఉన్నారు.



కన్వీనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

వైసిపికి బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి- బాడంగి



పాలవలస గౌరు

2019 ఎన్నికల్లో ఎస్‌టి గిరిజన తెగలకు అనేక రకాల బూటకపు హామీలను ఇచ్చే గద్దనెక్కిన ఈ జగన్మోహన్ రెడ్డి ఇంతవరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, గిరిజన ప్రాంతాలలో ఎస్‌టిల పథకాలను రద్దు చేశారని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపిటిసి పాలవలస గౌరు విమర్శించారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్‌టి ఎరుకుల, గిరిజన కులాల చేతి వృత్తులు పోయాయన్నారు. వారికి రావాల్సి పథకాలను రద్దు చేయడం వల్ల ఆర్థికంగా వెనుకబడిపోయారన్నారు. టిడిపి ప్రభుత్వంలో వృత్తుల పరంగా పనిముట్లు ఇచ్చి, సబ్సిడీ లోన్‌లను ఇచ్చి గిరిజనులను ఆదుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో గిరిజనులను మోసం చేసిన ఈ వైసిపి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఎస్‌టి గిరిజనులంతా టిడిపికే మద్దతు ప్రకటించాలని కోరారు.

వృద్ధురాలికి జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ 11వ వార్డులో చల్లమ్మ అనే వృద్ధురాలికి జనసేన నియోజకవర్గం ఇంఛార్జి లోకం మాధవి రూ.12వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వృద్ధురాలు తన రెక్కల కష్టంతో జీవనోపాధి కొనసాగిస్తూ చిన్న పూరి గుడిసెలో తాను ఒక్కటై జీవితం గడుపుతూ ఉంటుంది. ఈ ప్రాంతవాసులు ఆమె కష్టాలు చూసి నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి లోకం మాధవి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆమె వెంటనే స్పందించి ఆదివారం ఆమె వద్దకు వచ్చి ఆర్థిక సాయం అందించారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆ మహిళకి ఆత్మస్థైర్యాన్ని నింపి, జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం రాగానే తనకి పక్కా ఇల్లు మంజూరు అయ్యేలా తాను చొరవ తీసుకుంటానని మాధవి భరోసా ఇచ్చారు. వృద్ధురాలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా తనను పట్టించుకునే నాధుడే లేడని, ఏ ప్రభుత్వం వచ్చినా తనకు ఇల్లు మంజూరు చేయలేదని, తన కష్టాలను తెలుసుకుని వచ్చి ఆర్థిక సాయం అందించిన మాదవికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.



వృద్ధురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న మాధవి

47 మందికి కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విక్టరీ షుటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ శిక్షకులు రాజు మాస్టర్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో వివిధ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 47 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 39 మంది పసుపు రంగు బెల్టులు సాధించుకోగా ఆరెంజ్ బెల్టు నలుగురు, గ్రీన్ బెల్ట్ ఇద్దరు గెలుపొందారు. పద్మనాభ మండలం కొత్త కొవ్వాడలో ఉన్న సంస్కృతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 5,6 తరగతులు చదువుతున్న జశ్విత, లోసికలు బ్రౌన్ బెల్ట్‌లు సంపాదించారు. స్వామివివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు లక్కవరపుకోట హెడ్ కానిస్టేబుల్ పాపారావు, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సంగం హారిక ధ్రువీకరణ పత్రాలు బహుకరించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలతో విద్యార్థులు, నిర్వాహకులు

బిసిలకు టికెట్ ఇచ్చే దమ్ముందా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బాడంగి

బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి అధిష్టానం బిసిలకు టికెట్ ఇచ్చే దమ్ముందా? అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రశ్నించారు.. ఆదివారం మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రి ఎదురుగా నిర్మించిన వైసిపి కార్యాలయాన్ని కుమారుడు శ్రీకాంత్, సోదరడు వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాలో జయహో బీసీ అంటూ తిరిగే టిడిపి నాయకులు బొబ్బిలి నియోజకవర్గంలో 85 శాతం ఉండే బీసీలకు కాకుండా రాజులకు టిక్కెట్ ఇవ్వడం ఎంత వరకూ సమంజసమన్నారు. వైసిపి కార్యకర్తలంతా రానున్న ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వ పథకాలు గురించి ప్రతి ఒక్కరికీ పూర్తిగా వివరించాలన్నారు. ఈసారి బొబ్బిలిలో వైసిపి జెండా ఎగుర వేసి బీసీల సత్తా.. రాజులకు చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వెంకట్ నాయుడు, ఎంపిపి గౌరి, నాయకులు తెంటు మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ఆర్‌ఎస్ జాన్‌కు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి డాక్టర్ ఆర్.ఎస్.జాన్‌ని సిమ్స్ చర్చి సభ్యులు సన్మానించారు. ఆదివారం సిమ్స్ చర్చిలో అధ్యక్షులు తాలాడ ఆనందరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వరప్రసాద్, సంయుక్త కోశాధికారి ఎ.కె.కుమార్, సండే స్కూల్ సూపరింటెండెంట్ ఆర్.ఝాన్సీరాణి, కుమార్, సిఐ వోరాజ్ కుమార్, సుగుణరావు, యూత్ ప్రెసిడెంట్ జీవన్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



జాన్‌ను సత్కరిస్తున్న చర్చి సభ్యులు

నేరాలు ఘోరాలు

పాతకోటలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక పాతకోటలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. పాతకోట వద్ద ఉన్న ఫర్నిచర్ షాపు ముందు ఉన్న చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు వ్యాపించి కోట లోపల ఉన్న ప్లాస్టిక్ పైపులు, ఫర్నిచర్, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వంద మద్యం బాటిళ్లు పట్టివేత

వంగర: 100 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని కొప్పర గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వైవి జనార్థన్ ఆదివారం తెలిపారు. మద్దివలస సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడంతోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

పశువుల తలలు స్వాధీనం

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక సమీపంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు అరవై పశుతలలను బొండపల్లి పోలీసులు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. కొంతమంది వ్యక్తుల సమాచారం మేరకు ఆదివారం ఒరిస్సా నుండి విజయనగరం వైపు వ్యాన్‌తో తరలిస్తున్న పశు తలలను తమ సిబ్బంది స్వాదీనం చేసుకున్నారని చెప్పారు. తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి - జామి

మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ సౌజన్యంతో గ్రామంలో బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ సభ్యులు, అధ్యక్షులు కొవ్వాడ చంద్రశేఖర్, కొవ్వాడ సన్యాసినాయుడు వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు సత్య మాస్టారు, నారాయణ, వెంపడాపు సూర్యారావు తల్లిదండ్రులు కీర్తిశేషులు అప్పారావు, అన్నపూర్ణ దంపతుల పేర్ల మీద ఈ బస్సు షెల్టర్‌ను నిర్మించారు. సుమారుగా రూ. 1.30లక్షల ఖర్చుతో నిర్మించిన ఈ షెల్టర్‌ను గ్రామ సర్పంచ్ కిలారి సూర్యారావు ప్రారంభించి దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



బస్సు షెల్టర్ వద్ద దాతల కుటుంబ సభ్యులు